
# ప్రియే! మిసప్రాప్రియే!

కటువైన నిజాల్ని చెప్పి నొప్పించటం కంటె మృదువైన అబద్ధాల్ని చెప్పి సంతృప్తిపరచటం మంచిదికదా-జీవితంలో ఎన్నో అందమైన అబద్ధాల్ని చెప్పాలిసొస్తుంది. తప్పదు మరి. "నీ దగ్గరేం దాచను సుశీ" అంటూనే ఎన్నో హరికథలు చెప్తాడు భర్త. "డబ్బు అప్పుడే అయిపోయిందా?" అని ముఖం చిట్లిస్తున్న భర్తను "వుండండి ఆలోచించుకుని చెప్తా" నంటూ ఆవిడ కొన్ని అబద్ధాలను అల్లటానికి మైమరుగుతుంది. ఏ చీటీ గుడ్డలవాడో, చీరలమ్మేవాడో, స్టీలుగిన్నెల షాపువాడో, లేకపోతే రహస్యంగా చీటీకట్టడమో, ఇలాటి చిన్న చిన్న మిసప్రాప్రియేషన్‌లు ప్రతి ఇల్లాలికి తప్పవుమరి. చాలామంది హజ్బెండులు యీ రవికెక్కడిది. యీ చెంబా ఎక్కడిది, యీ గిన్నె ఎక్కడిది? యీ రుమాళ్ళు రిబ్బన్లు, పూసలు, గాజులు, దండలు ఎక్కడవని ఆరాలు తీయజాలరు. దోసకాయపప్పు, బంగాళాదుంప వేపుడు, వంకాయ బజ్జిపచ్చడి చేసిపెడితే తినేసి మూతి తుడుచుకుని లేచ్చక్కాపోతారు. అయితే కొద్దిమంది చాదస్తపు పురుషులు మాత్రం ఎముకలు లెక్కెట్టేస్తారు. అసలు ఆఫీసు నుంచి రావటం నేరుగా వంటింట్లోకే-డబ్బాలు గ్లాసులు చెంబులు అన్నీ వెతుకుతారు. ఎక్కువ అనుమానించిన కొద్దీ ఇంట్లో వాళ్ళు ఎక్కువ తప్పులు చేసే ప్రమాదం వుంది. తప్పించుకొనడానికి ఎక్కువ అబద్ధాలు ఆడేస్తారు.

స్త్రీలు "స్వేచ్ఛ" అనుభవించని కుటుంబాల్లో ఆనందం మృగ్యం. ఇల్లు ఎలా నడుపుకోవాలీ అనే విషయంపై ఆడదానికి ఏ కొంచెం పాటి

అధికారం కూడా లేకపోతే ఆ ఇల్లు సబ్‌జైలే— అటువంటి సంసారాల్లో అయ్యగారు వీధిలో కెళ్ళగానే అమ్మగారు పెత్తనాలకు బయలు దేరడం తప్పనిసరి. ఒక్క రూపాయికూడా ఇంద నీ దగ్గర వుంచుకో—దేనికైనా అవసరం వస్తుంది. అని యివ్వని కర్కోటకులే ఆడవాళ్ళని మానసికంగా హింసించి వాళ్ళచేత అకృత్యాలన్నీ చేయిస్తారు.

సరుకులు ఎక్కువగా తెప్పించి వాటిని రహస్యంగా పనిమనుషుల చేత అమ్మించి డబ్బు చేసుకోనేవారిని నేనెరుగుదును. కిరసనాయిలు,



బొగ్గులు, కట్టెలు, పంచదార, బియ్యం, పప్పులు అన్నీ చాటుగాఅమ్మించి ఆ డబ్బుతో చీరలూ రవికల గుడ్డలూ కోనుక్కోవటం, యివెక్కడివని అడిగితే—మావాళ్ళు పెట్టారని యింకా ఏవో బొంకులు బొంకడం- దొరికి పోతే తన్నులు తినటం యిలాటివన్నీ నాకళ్ళలో చూశాను. చాలా మంది మధ్యతరగతి స్త్రీలు తమ ఇళ్ళలో తామే దొంగతనాలు చేస్తూ హీనంగా జీవిస్తూ వుంటారు. దొడ్లో ఆరేసిన చీరెలూ, గాలికి ఎగిరిపడ్డ రవికెలూ ఎత్తుకపోయి అమ్మేసి నల్లమందు కొనుక్కునే ఆడవాళ్ళుండేవారు. ఎన్నె

శొ్యచిన ఆడదానైనా పదిమందిలో పట్టుకుని ఎంతమాటైనా అనటం, కొట్టడం లాంటి పనులు చేసేవారు. తల్లయినా పిల్లయినా పెళ్లామయినా ఎవరైనా సరే ఆడవాళ్ళు గడగడ లాడిపోతూ వుండాలిసిందే— కూర్చోమంటే కూర్చుని, నించోమంటే నించోవాల్సిందే—ఆడవాళ్ళపట్ల దయగా ప్రేమగా వుండేవారిని "ఆడంగి వెధవ." "చేతకాని దద్దమ్మ," "పెళ్లాం కాళ్ళు పిసుకుతాడు" అని ఎద్దేవా చేసేవారు. కొంతమంది" అమ్మను ఎలా తంతావురా?" అంటే "ఇలాతంతాను" అని పిలాడు కాళ్ళూపుతుంటే వాడిచేత అనిపించి మురిసి పోయేవారున్నారు. చాలామంది ఆడవాళ్లు ఈ కుటుంబ నరకయాతనలు పడలేక ఆచారం అలవాటు చేసుకుని తడి బట్టలు మడిబట్టల ప్రపంచంలోకి వెళ్ళిపోయి అందులో మునిగిపోయేవారు.

అయితే, యిప్పుడు పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. చదువుకుంటున్నారు. కనీసం మనం ఒక ప్రపంచంలో జీవిస్తున్నామనే స్పృహను స్త్రీలు కలిగివుంటున్నారు. ఇంకా వెనుకబడివున్నవారి సంఖ్యే ఎక్కువ. కుటుంబ బాధ్యత అంతా యిప్పుడు స్త్రీలమీదవుంది. ఈ చాకిరినుంచి స్త్రీకి విముక్తి లభించిననాడు ఆమె శక్తులు సేవలు సమాజానికి ఎక్కువగా లభించే అవకాశం వుంది. మన కుటుంబ వ్యవస్థలో అత్యవసరమైన కొన్ని సర్దుబాట్లు జరగాలి.

అయితే స్త్రీ జీవితం రానురాను కుంపట్లోంచి గాడిపొయ్యిలోకి పడినట్లవుతుంది. వెనుకబడిన వ్యవస్థలో "బానిస"లా చూస్తే అభివృద్ధి చెందిన సమాజంలో ఆమె కేవలం "భోగవస్తువుగా ఆట బొమ్మలా ఉంటుంది. బానిసలా వుండకుండా ఆటబొమ్మలా వుండటానికి ఎక్కువ మంది యిష్టపడుతున్నారు. డబ్బు వుంటే 'ప్రెడిషన్' అక్కర్లేదు. డబ్బుకి కాని ఆస్తులకి కాని ప్రమాదంవస్తే ఆడవారికి 'ప్రెడిషన్' అక్కర్లేదు. లేకపోతే కావాలి.

మళ్ళీ మొదటికొద్దాం. అందమైన అబద్ధాలు అంటే— మనం కొత్త చీర కట్టుకుని కుచ్చెళ్ళు సర్దుకుంటూ "ఎలా వుందండీ" అని అడిగితే

మనవాళ్ళు "బావున్నావు చాలా బాగున్నావు. ఈ చీర నీకు ఫస్టుగా వుంది" అంటారు ! అనకపోతే మనం ఎందులోనన్నా దూకాలి. నిజం చెప్పస్తే భరించేశక్తి మనకు వుండొద్దూ? మా వారప్పుడప్పుడు సడెన్‌గా వచ్చి "యిప్పుడు అర్జంటుగా సినిమా కెళ్ళాలి" అని గొడవచేస్తారు. నేను అర్జంటుగా ఎల్లాగా తెవలేనని వారికి తెలుసు. ఇప్పుడు కుదరదండీ అని నాచేత అనిపించి తరువాత ఆయన ఎక్కడో పనుందంటూ వెళ్ళిపోతారు. ఇదో ట్రిక్కని నేను తరువాత గ్రహించాను.

"లే పద. ఇవాళ మనం మనోరమాలో భోజనంచేసి లీలామహలుకి వెళ్ళాలి" అంటారు. అంతా ఉత్తిదే — "మనోరమలో భోజనంచేస్తే పది రూపాయలు అవుతుందని నేను గుండె బాదుకుంటానని ఆయనకు తెలుసు.

"నువ్వెక్కడికిరావు. మళ్ళీ నిన్నెక్కడికీ తీసుకెళ్ళడంలేదని నాకు బాధగా ఉంటుంది" అని మొసలి కన్నీరు కారుస్తూ వుంటారు.

"జేబులో డబ్బు వుండాలి— ఏం చేశారు" అని క్రాసెగ్జామిన్ చేశాననుకోండి. అల్లవారి కప్పిచ్చాను, వీరి కప్పిచ్చాను అని కోస్తారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఆ అప్పులు వసూలు చేశారా అంటే "అయ్యో మొన్న నీ కిచ్చిన పాతికా ఎక్కడిదని దబాయిస్తారు. మిసెస్‌ప్రాప్రియేషన్లో తెలిసిపోయే తెలివితక్కువ అబద్ధాలు చెప్పటంలో మావారు పద్మశ్రీ. అయితే ఆ మొహంకేసి చూస్తేనే తెలిసిపోతుంది అబద్ధాలు చెప్పటానికి ఆయన తెలివితక్కువగా పడే తాపత్రయం .... అయితే ఆ డబ్బు ఎల్లా తగలబెట్టారో నిజవడిగి తెలుసుకున్నాక— ఆ కటువైన నిజం ముందు నిలబడి అవమానం పొందడంకంటె ఈ అబద్ధాల పాదధూళి కాస్త నెత్తిన జల్లుకోవడమే సుఖం, శుభప్రదమూనూ. దీనివల్ల నీతి ఏమంటే నిజం చెప్పమని భర్తలను కాకరకాయ కూరలా వేపుకు తినకూడదు. ఎవరి అబద్ధాలు వారివే కాని జీవితం మాత్రం ఇద్దరిదీనూ.